క్లుప్తంగా

'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కాదు'

కల్వకుర్తి టౌన్: రైతు రుణమాఫీ విషయంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని విమర్శించే స్థాయి మున్సిపల్ చైర్మన్ సత్యంకు లేదని కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మున్సిపాలిటీలో వెంచర్ అనుమతుల కోసం చైర్మన్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అక్రమంగా కోట్లు సంపాదించారని తెలిపారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు లక్ష్మి, ఎజాస్, శ్రీను, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, మాజీ సర్పంచులు సుదర్శన్ రెడ్డి, రాములు సురేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాహుల్, శ్రీనివాస్ రెడ్డి, రామరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

కల్వకుర్తి: సామాజిక మాధ్యమాల్లో రెడ్డి కులానికి సంబంధించి అనుచిత పోస్టులు పెడుతున్న శరత్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ మాధవరెడ్డికి సోమవారం పాలమూరు రెడ్డి సేవా సమితి కల్వకుర్తి నాయకులు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా అసభ్యకరంగా పోస్టులు చేస్తున్నారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ తెలకపల్లి మండలంలోని పర్వతాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు సత్యనారాయణ(70) బిజినేపల్లి మండలంలోని వెంకటాపూర్‌లో ఉన్న కూతురు ఇంటికి వెళ్లాడు. సోమవారం తిరిగి తన స్వగ్రామానికి వచ్చేందుకు వెంకటాపూర్ గ్రామంలోని బస్టాండు ప్రాంగణం వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం వృద్ధుడిని ఢీకొట్టింది. ఈప్రమాదంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

డ్రోన్ యంత్రంతో మందుల పిచికారీ



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, వరి వివిధ పంటలకు డ్రోన్ యంత్రంతో మందుల పిచికారీ చేస్తున్నారు. ఇటీవల తరుచూ కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు ఏపుగా పెరిగి మందులు పిచికారి చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు నూతన టెక్నాలజీని వినియోగించుకుంటున్నారు. డ్రోన్ యంత్రాలతో పంటలను పిచికారి చేస్తున్నారు. ఎకరాకు 5 నిమిషాల పాటు పిచికారీ చేస్తునట్లు డ్రోన్ యంత్రం నిర్వాహకులు ప్రశాంత్‌రెడ్డి, గంగనంరెడ్డి పేర్కొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ పంచాయతీకి సోమవారం రిసార్ట్ యాజమానులు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత కోసం తమ బాధ్యతగా బుట్టలు అందించినట్లు భరత్, శివకుమార్, దిలీప్, రఘులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి సాధిక్, మాజీ సర్పంచ్ మద్దిలేటి, పంచాయతీ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

గట్టురాయిపాకులలో ఫాగింగ్

తెలకపల్లి: మండలంలోని గట్టురాయిపాకులలో సోమవారం రాత్రి దోమల నివారణ కోసం అధికారులు ఫాగింగ్ చేశారు. విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు.

పంచాయతీ సిబ్బందికి సన్మానం

అమ్రాబాద్: గ్రామ పంచాయతీ సిబ్బందిని, పారిశుద్ధ్య కార్మికులను సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కొత్త దుస్తులను అందజేశారు. ఇటీవల వెంకటలక్ష్మమ్మ ఉత్సవాల సందర్భంగా కార్మికులు పూర్తి సహకారం అందించారని దీంతో వారిని సన్మానించినట్లు పేర్కొన్నారు. రాజారాంగౌడ్, జగన్‌గౌడ్, హరీష్‌గౌడ్, తిరుపతయ్య, సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐకి ఫిర్యాదు

కల్వకుర్తిరూరల్: మహ్మద్ ప్రవక్త కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందిన రామగిరి మహరాజ్‌పై ముస్లింలు సోమవారం ఎస్‌ఐ మాధవరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నిరసన తెలిపారు. కౌన్సిలర్లు ఎజాస్, తాహేర్ అలీ, నాయకులు సత్తార్, అప్పు, మసూద్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



పదరలో రాధాకృష్ణుల వేషధారణలో ఉన్న చిన్నారులతో గ్రామస్తులు



లింగాల మండలం కోమటికుంటలో

భజరే.. ముకుందా మురారి



నాగర్‌కర్నూల్ ఉట్టి కొడుతున్న చిన్నారి



కల్వకుర్తిలో గోపిక వేషధారణలో చిన్నారి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగర్‌కర్నూల్ సరస్వతి శిశుమందిర్ పాఠశాలతో పాటు జ్ఞాన వాత్సల్య మందిరం, భగవాన్ సత్య సాయి బాబా మందిరం, మన్ననూర్ పాత బజార్ కాలనీలో చిన్నారులు రాధాకృష్ణా వేషధారణలో ఆకట్టుకున్నారు. అమ్రాబాద్, పదరతో పాటు వంకేశ్వరం, చిట్లంకుంట గ్రామాల్లో యాదవసంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కొల్లాపూర్ రూరల్ పరిధిలోని సింగోటం, కల్వకుర్తి, తెలకపల్లి మండలంలోని గౌరారంలో, లింగాల మండలంలోని కోమటికుంట ఆంజనేయ స్వామి ఆలయం, బిజినేపల్లిలో ప్రత్యేక పూజలు చేశారు. తాడూరు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఉట్లు కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కొల్లాపూర్ పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో రాధాకృష్ణుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను పట్టణంలో ఊరేగించారు. శ్రీకృష్ణనగర్‌లోని రాధామురళీగోపాల కృష్ణ ఆలయంలో దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత బస్టాండ్‌లో యువకులకు ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోడేరులో శ్రీకృష్ణుడి ప్రతిమను భక్తిగీతాలను ఆలపిస్తూ ఊరేగించారు. చారకొండలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. మంగళవారం ఉట్లు కొట్టుట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ దేరం రామ శర్మ, ఈఓ ఆంజనేయులు పేర్కొన్నారు.



కొల్లాపూర్‌లో ఉట్టి కొడుతున్న యువకుడు



బిజినేపల్లిలో..



కొల్లాపూర్ మండలం సింగోటంలో ప్రత్యేక పూజలు చేస్తున్న యాదవులు



నాగర్‌కర్నూల్‌లో..

అదనపు బస్సులు కేటాయించాలి



కల్వకుర్తి బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కల్వకుర్తిరూరల్: గ్రామాలకు రాకపోకలు సాగించే బస్సుల సంఖ్య పెంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్‌లో ప్రయాణికులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. బస్సులు తక్కువగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికులకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీనివాసులు, బాలయ్య, యాదయ్య, జగన్, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: గ్రామాలకు రాకపోకలు కొనసాగేందుకు అదనపు బస్సులు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి దశరథం డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో నాయకులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. పెబ్బేటి శంకర్, ఈశ్వర్, సతీష్, గ్రామపంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. మండల కార్యదర్శి శివవర్మ, సలీం, చంద్రునాయక్, సురేందర్ తదితరులున్నారు.



కొల్లాపూర్‌లో..

ప్రమాదాలపై పట్టింపేది?

- రోడ్ల నిర్వహణపై నిర్లక్ష్యం
- తరుచుగా ప్రమాదాలు



ఉప్పునుంతల- అచ్చంపేట రోడ్డు మార్గంలో కట్లబండ వద్ద ప్రమాదకరంగా మలుపు

ఉప్పునుంతల: మండలంలో పలు చోట్ల రోడ్లు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల మూల మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించడం లేదు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో పాటు సూచిక బోర్డులు లేక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

జప్తీ సదగోడు సమీపంలో, మొల్గర పెద్దాపూర్ మార్గ మధ్యలో, మామిళ్లపల్లి సమీపంలో ఉన్న మూల మలుపులు ప్రమాదంగా ఉన్నాయి. తాడూరు సమీపంలోనే కొరటికల్ వైపు వెళ్లే మార్గంగా ఉన్న రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వచ్చే వహనాలు ఏమాత్రం కన్పించడలేదు. ఆ పక్కనే పాడుబావి ప్రమాదభరితంగా ఉంది. కొరటికల్ నుంచి వెల్టూరు వెళ్లే రోడ్డు మార్గంలో రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. అదేవిధంగా మట్టి రోడ్లు బీటీ రోడ్లుగా అభివృద్ధి చేసినప్పుడు రోడ్డు వెంట ఉన్న కరెంట్ స్తంభాలను మార్పు చేయకుండ వదిలేస్తున్నారు. ఉప్పునుంతల– అచ్చంపేట మార్గంలో ఐదేళ్ల కిందట డబుల్ రోడ్డుగా విస్తరణ పనులు చేపట్టి మల్లప్పవాగు సమీపంలో రోడ్డుపై ఉన్న కరెంట్ స్తంభాలను అలాగే వదిలేశారు.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు

ఉప్పునుంతల – అచ్చంపేట మార్గ మధ్యలో కట్లబండ స్టేజీ వద్ద ప్రమాదంగా ఉన్న మూలమలుపు వద్ద గడచిన రెండేళ్ల వ్యవధిలోనే ఒక ఉపాధ్యాయునితోపాటు ఇద్దరు యువకులు మొత్తం ముగ్గురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉప్పునుంతల వైపు నుంచి వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలోకి పడి ప్రమాదాల పడుతున్నారు. రోడ్డు పక్కన గోతి మాదిరిగా ఉండటంతో బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే చనిపోతున్నారు. అదేవిధంగా ఉప్పునుంతల నుంచి జప్తీ సదగోడు వెళ్లే మార్గంలో ఉష్మాన్ పౌల్ట్రీఫాం సమీపంలోని మూల మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు ఏమాత్రం కన్పించడంలేదు. ఒకే ప్రాంతంలో రెండు మూలమలుపులు ఉండటం ప్రమాదానికి మరింత కారణమవుతుంది. నెల రోజుల కిందట ఇదే ప్రాంతంలో ఎదురుగా వచ్చే బోరుబండి కన్పించకపోవడంతో బైక్ బోరుబండిని ఢీకొని ఉప్పునుంతలకు చెందిన యువకుడు మందుల శ్రీకాంత్ ప్రమాదానికి గురై వారం రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. గతేడాది ఇదే మూలమలుపు వద్ద ఎదురెదురుగా వాహనాలు ఢీకొని జప్తీ సదగోడుకు చెందిన యువకుడు అక్కడిక్కడే చనిపోయాడు.

అధికారుల నిర్లక్ష్యం

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలను నియంత్రించే విషయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఉప్పునుంతల నుంచి అచ్చంపేట వెళ్లే మార్గంలో కట్లబండ వద్ద ఉన్న రోడ్డు మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. అధికారులు కనీసం రేడియం స్టిక్కర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిచెట్లు, గడ్డిని తొలగించాలి.

– పుట్ట సాయిబాబు, కొత్తరాంనగర్

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మూల మలుపుల వద్ద జరుగుతున్న ప్రమాదాల వివరాలను ఉన్నతాధికారులకు వివరించాం. మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించే విషయంపై శ్రద్ధ తీసుకుంటాం.

– లక్ష్మీపతి, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఏఈ

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ మాధవరెడ్డి, అసోసియేషన్ సభ్యులు

కల్వకుర్తి టౌన్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్‌ఐ మాధవరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సీబీఎల్ కళాశాల మైదానంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికలు నిర్వహించారు. ఈ నెల 19, 20వ తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలోని సింథటిక్ గ్రౌండ్‌లో నిర్వహించే 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ సౌత్ జోన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్–14, 16, 18, 20 విభాగాలలో ఎంపికలు చేపట్టారు. మొత్తం 400 మంది హాజరుకాగా 30 మందిని ఎంపికచేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా.స్వాములు తెలిపారు. అంతకుముందు జిల్లా స్థాయి క్రీడాపోటీలు ఏర్పాటు చేశారు. ప్రతిభకనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విజేందర్, పరశురామ్, భిక్షపతి, మాజీ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



లింగాలలో బోనాలతో వస్తున్న మహిళలు

లింగాల: మండల కేంద్రంలో సోమవారం గ్రామ దేవత పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ముందుగా గ్రామ దేవత బొడ్రాయి చుట్టు బోనాలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని దేవతకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు. ఎస్‌ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని అంతిరెడ్డిపల్లిలో పోచమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పువాయిద్యాల నడుమ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మహిళలు పూనకాలు ఊగారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు తదితరులు ఉన్నారు.



వెల్దండ మండలం అంతిరెడ్డిపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామ శివారులో వెలిసిన మల్లికార్జున స్వామికి శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా వేద పండితులు గంటమఠం భూషణయ్య ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామివారికి రుద్రాభిషేకం చేసి అలంకరించారు. తెలకపల్లి, కార్వంగ, తాళ్లపల్లి గ్రామాల నుంచి భక్తులు, అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, బాలస్వామి, మధు తదితరులు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు బాగాలేక.. బస్సులు బంద్



తీగలపల్లి డ్యాం కట్టపై బురదమయంగా ఉన్న మట్టి రోడ్డు

కోడేరు: పాలమూరు –రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా తీగలపల్లి నుంచి రాయిపాకుల మీదగా నాగర్‌కర్నూల్ వరకు ఉన్న బీటీ రోడ్డు ప్రాజెక్టులో మునిగిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు డ్యాం కట్టపై తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ఈ రోడ్డుగుండా బస్సులు రాకపోకలు కొనసాగేవి. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు బురద మయంగా మారింది. దీంతో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ డిపో అధికారులు బస్సులను వారం రోజుల నుంచి నిలిపివేశారు. కొల్లాపూర్ డిపో బస్సులు కోడేరు నుంచి తీగలపల్లి వరకు మాత్రమే రాకపోకలు కొనసాగుతున్నాయని ప్రయణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి డ్యాం కట్టపై ఉన్న రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కృష్ణ రెండు రోజుల కిందట బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.10వేలు సమకూర్చారు. ఈ మేరకు సోమవారం ట్రస్టు సభ్యులు బాధితుడికి నగదు అందజేశారు. గణేష్, కిషోర్, రామకృష్ణ, శేఖర్‌గౌడ్, నాగరాజు, పాండు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు గుంపాల నర్సమ్మ మృతిచెందడంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ బాలస్వామి, పర్వతాలు, దాసరాజు సాయి, ప్రశాంత్, రిజ్వాన్, శివ, ఆనంద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మదర్ థెరిస్సా జీవితం ఆదర్శం



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకుడు

నాగర్‌కర్నూల్‌రూరల్: మదర్ థెరిస్సా జీవితం అందరికీ ఆదర్శమని బీసీ సంఘం నాయకుడు కుంభం మల్లేష్‌గౌడ్, అరవిందాచారి అన్నారు. పట్టణంలో బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వారు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రార్థించే పెదవుల కన్నా, సాయం చేసే చేతులు మిన్న అని చాటి చెప్పిన గొప్ప మానవత మూర్తి, భారతరత్న మదర్ థెరిస్సా అని వారు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రాము, నయీం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం

మన్ననూర్: హిందూధర్మాన్ని కాపాడుకుందామని వీహెచ్‌పీ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద స్వీట్లు పంచుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1964లో శబరి ఆశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమిన వీహెచ్‌పీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, ఆర్యసమాజ్ నాయకులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్ల కోసం పడిగాపులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద ఆసరా పింఛన్ల కోసం లబ్ధిదారులకు పడిగాపులు తప్పట్లేదు. సోమవారం పింఛన్లు పంపిణీ చేస్తున్నారనే విషయం తెలుసుకున్న మండల కేంద్రంలోని ఆసరా లబ్ధిదారులు కార్యాలయానికి చేరుకున్నారు. నెట్‌వర్క్, సర్వర్ సమస్యతో పంపిణీలో ఆలస్యం అవుతుందని పోస్టాఫీసు అధికారులు చెబుతున్నారు. కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు.